


దివ్యాంగుల పింఛన్ల తనిఖీ

కారెంపూడి: దివ్యాంగుల పింఛన్ల పరిశీలనా బృందం సోమవారం తనిఖీలు చేసింది. మండలంలో 41 మంది ఇళ్లకు వెళ్లి ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి సేకరించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 567.60 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 9,500 క్యూసెక్కులు వదిలారు.



హరినామ సంకీర్తన గానం

తెనాలి: పట్టణంలోని శ్రీరుక్మిణి సమేత గోవర్ధన స్వామి దేవాలయం, శ్రీఆంజనేయస్వామి దేవాలయంలో సోమవారం సాయంత్రం శ్రీహరి నామ సంకీర్తన బృందం గానం జరిగింది.

న్యూస్‌రీల్

సంక్రాంతికి ప్రత్యేక రైళ్లు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో సంక్రాంతి సందర్భంగా ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్టు సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ సోమవారం తెలిపారు. కాచిగూడ–శ్రీకాకుళం రోడ్డు (07615) మధ్య ప్రత్యేక రైలును ఈనెల 11, 15 తేదీలలో నడపనున్నట్టు వెల్లడించారు. శ్రీకాకుళం రోడ్డు–కాచిగూడ(07616) మధ్య ఈనెల 12, 16 తేదీలలో ప్రత్యేక రైలును నడపనున్నట్టుపేర్కొన్నారు. చర్లపల్లి–శ్రీకాకుళం రోడ్డు(07617) మధ్య ఈనెల 8న, శ్రీకాకుళం రోడ్డు–చర్లపల్లి(07618) మధ్య ఈనెల 9న ప్రత్యేక రైళ్లు నడుస్తాయని డీసీఎం వివరించారు. ఈ రైళ్లు గుంటూరు డివిజన్ మీదుగా ప్రయాణిస్తాయని పేర్కొన్నారు.

రాజకీయ పార్టీ సమావేశంలో వీఆర్వో



సత్తెనపల్లి: అధికారులు రాజకీయాలకు అతీతంగా సేవలందించాలి. కానీ కొందరు అది మరచి నాయకుల సమావేశంలో పాల్గొంటూ వ్యవస్థకు చెడ్డ పేరు తీసుకు వస్తున్నారు. సత్తెనపల్లిలోని రఘురామ్‌నగర్‌లో సోమవారం నియోజకవర్గ పట్టభద్రుల ఆత్మీయ సమావేశాన్ని కూటమి నాయకులు నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ కార్యకర్త మాదిరిగా సత్తెనపల్లి టౌన్ వీఆర్‌ఓ అరుణతో పాటు సచివాలయ ఉద్యోగులు పాల్గొని అందరినీ ఆశ్చర్యానికి గురి చేశారు. మరి దీనిపై ఆ శాఖ జిల్లా అధికారులు ఏ విధంగా స్పందిస్తారో చూడాలి మరి.

8న జిల్లాస్థాయి రంగోత్సవ్ పోటీలు

యడ్లపాడు: జిల్లాస్థాయి రంగోత్సవ్ పోటీలు ఈనెల 8వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి గుంటూరు జిల్లా విద్యాశిక్షణ సంస్థ ప్రిన్సిపాల్, పల్నాడు జిల్లా డీఈవో ఎల్. చంద్రకళ తెలిపారు. ఏటా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన జూనియర్ కళాశాలలు, ప్రైవేటు స్కూళ్లల్లో 6 నుంచి 12వ తరగతి చదివే బాలబాలికలకు పోటీలను నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. క్విజ్/స్వాతంత్య్ర సమరయోధుల చిత్రాల డ్రాయింగ్, హ్యాండ్ రైటింగ్(తెలుగు, ఆంగ్లం), రంగోలి (ఐదుగురు సభ్యులు), జానపద నృత్యం, డిజిటల్ కాలేజ్ (యూనిటీ, సమైక్యత పోస్టర్), స్లోగన్ రైటింగ్ (ఏక్తా భారత్ శ్రేష్ఠ భారత్), రోల్‌ప్లే (భారత సంస్కృతి, చరిత్ర) వంటి ఎనిమిది విభాగాల్లో ఉంటాయని తెలిపారు. ప్రతి కళారూపానికి 5 నిమిషాల సమయం మాత్రమే ఉంటుందని, పోటీల్లో పాల్గొనే కళాకారులు అవసరమైన సామగ్రిని వారే తెచ్చుకోవాలని సూచించారు. గత ఏడాది రంగోత్సవ్ పోటీల్లో మొదటి మూడు విభాగాల్లో విజేతలైన వారు పోటీలో పాల్గొనడానికి అనర్హులని తెలిపారు. ఆసక్తి కల విద్యార్థులు వివరాలను జిల్లా విద్యాశిక్షణ సంస్థ మెయిల్‌కు పోస్టు చేయాలని కోరారు. మరిన్ని వివరాలకు కళాశాలలో అధ్యాపకులు పి. పోలేరు, కె. ప్రసాద్ సెల్: 97047 90917ను సంప్రదించాలని తెలిపారు.

ఫిబ్రవరి 28లోగా లైఫ్ సర్టిఫికెట్లు అందజేయాలి

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా పరిధిలోని పెన్షన్‌దారులు ఫిబ్రవరి 28వ తేదీలోగా లైఫ్ ధ్రువీకరణ పత్రాలను కార్యాలయంలో అందజేయాలని జిల్లా ఖజానా శాఖ అధికారి వి. స్వామినాథన్ సోమవారం తెలిపారు. జిల్లా పరిధిలోని ఉప ఖజానా కార్యాలయాల్లో లైఫ్ సర్టిఫికెట్లు అందజేసి తమ పెన్షన్ ఆలస్యం కాకుండా చూసుకోవాలని ఆయన సూచించారు. మీసేవా, సచివాలయం, జీవన ప్రమాణ యాప్‌ల్లో వివరాలు నమోదు చేసుకోవాలని తెలియజేశారు. లైఫ్ సర్టిఫికెట్ అందజేసే సమయంలో ఆధార్ కార్డు, ఫోన్ నంబర్, బ్యాంకు ఖాతా నకలు తప్పనిసరిగా ఖజానా కార్యాలయంలో అందజేసి వివరాలను ఆన్‌లైన్ చేసుకోవాలని ఆయన సూచించారు.

స్టేట్ వేర్ హౌసింగ్ గోదాములు తనిఖీ



నరసరావుపేట: పట్టణంలోని స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ బఫర్ గోదాములను జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాకు రిజిస్టర్లు పరిశీలించి స్టాకు సక్రమంగా ఉందా లేదా అనేది చూశారు.

కూటమిలో గ్రానైట్ ఫైట్

- కూటమి ప్రభుత్వంలో భారీగా జరుగుతున్న గ్రానైట్ అక్రమ రవాణా
- ప్రకాశం జిల్లా కీలక ప్రజాప్రతినిధి, పల్నాడు సీనియర్ నేత ఆధ్వర్యంలో దందా
- ప్రాధాన్యత ఇవ్వలేదంటున్న ఇతర ప్రజాప్రతినిధులు
- ముడుపుల పంపకంలో కూటమి ప్రజాప్రతినిధుల మధ్య కోల్డ్‌వార్
- అక్రమ రవాణాపై రాష్ట్ర జీఎస్టీ కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన ఓ వర్గం ప్రజాప్రతినిధులు
- బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో శనివారం 14 గ్రానైట్ లారీలకు ఫైన్ వేసిన అధికారులు
- మార్టూరు సిండికేట్‌కు వ్యతిరేకంగా రోడ్డుకెక్కిన కూటమి నేతల పోరు



నకరికల్లు హైవేలో శనివారం రాత్రి జీఎస్టీ అధికారులు ఆపిన గ్రానైట్ లారీలు (ఫైల్ ఫోటో)

సాక్షి, నరసరావుపేట: మూడు నకిలీ వే బిల్లులు, ఆరు చెక్‌పోస్టులుగా సాగుతున్న గ్రానైట్ అక్రమ రవాణా కాస్తా కూటమి నేతల లుకలుకలతో రోడ్డున పడింది. ప్రభుత్వం వచ్చిన రోజు నుంచి ప్రకాశం, పల్నాడు జిల్లాల నుంచి తెలంగాణ, కర్నాటక, మహారాష్ట్రాలకు నిత్యం వందల లారీలు ఆంధ్ర బార్డర్ దాటుతున్నాయి. పోలీసులు, రవాణా శాఖ, మైనింగ్, జీఎస్టీ అధికారులకు భయపడకుండా, పగలు రాత్రీ అని తేడా లేకుండా జీరో బిల్లులతో గ్రానైట్ పక్క రాష్ట్రాలకు తరలింది. యథేచ్ఛగా సాగుతున్న గ్రానైట్ మాఫియాపై గత శనివారం పలు ప్రాంతాల్లో మూకుమ్మడిగా జీఎస్టీ అధికారులు దాడులు చేయడంపై విస్మయం వ్యక్తమవుతోంది. ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఎప్పుడు లేనివిధంగా ఏకంగా ఆరు ప్రత్యేక టీంలుగా ఏర్పడ్డాయి. నరసరావుపేట, నకరికల్లు, కొండమోడు, బాపట్ల జిల్లా మార్టురు, సంతమాగులూరు, బల్లికురవ ప్రాంతాల్లో దాడులు చేసి 14 లారీలను పట్టుకొని రూ.25 లక్షల దాకా జరిమానా విధించారు. అయితే, ఒక్కసారిగా ఇంత పెద్ద మొత్తంలో దాడులు చేయడంపై జిల్లాలో పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. గ్రానైట్ దందాలో వర్గపోరుతోనే ఈ దాడులు జరిగాయనే ప్రచారం నడుస్తోంది.

మార్టూరు గ్రానైట్ సిండికేట్‌కు వ్యతిరేకంగా...

బాపట్ల జిల్లాకు చెందిన ఓ కీలక ప్రజాప్రతినిధి ఆధ్వర్యంలో ఈ గ్రానైట్ అక్రమ రవాణా వ్యవహారం జరుగుతోందన్న విషయం అందరికి తెలిసిందే. ఆయనకు వ్యక్తిగత సహాయకుడిగా ఉన్న వ్యక్తి గ్రానైట్ సిండికేట్‌ను నిర్వహిస్తున్నారు. టోకెన్ అమ్మే దగ్గర నుంచి ఈ–వే బిల్లు, జిల్లా దాటించడం, తెలంగాణలో డబ్బుల పంపిణీ వరకు మొత్తం అతనే చూస్తున్నాడు. రూ.14 వేల టోకెన్‌ను ఏకంగా రూ.30 వేలు వసూల్ చేసి దందాకు సహకరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులకు ముట్టజెపుతున్నాడు. బాపట్ల జిల్లాలో ఓ కీలక ప్రజాప్రతినిధికి, పల్నాడులో ఓ సీనియర్ ఎమ్మెల్యేకు నెలవారీ మామూళ్లు చేరుతున్నాయి. అయితే, ఈ క్రమంలో పల్నాడు జిల్లాలో గ్రానైట్ అక్రమ రవాణా జరిగే ప్రాంతాల ప్రజాప్రతినిధులకు మార్టూరు గ్రానైట్ సిండికేట్ నుంచి వాటా రావడంలేదని వారిలో అసంతృప్తి నెలకొందని సమాచారం. దీంతో కూటమి నేతల మధ్య కోల్డ్‌వార్ నడుస్తోందట. ఈ నేపథ్యంలో అసంతృప్తిలో ఉన్న ప్రజాప్రతినిధులు అక్రమ రవాణాపై శనివారం రాష్ట్ర జీఎస్టీ కమిషనర్‌కు ఫిర్యాదు చేసి, దాడులు జరిగేలా చేశారన్న ప్రచారం పల్నాడులో బాహాటంగా వినిపిస్తోంది. ఒకరిద్దరు కీలక నేతలకు మాత్రమే అనుకూలంగా పనిచేస్తున్న గ్రానైట్ సిండికేట్‌ను మార్చి, తమకు రావాల్సిన వాటా వచ్చే వరకు అక్రమ రవాణాను అడ్డుకుంటామని హెచ్చరిస్తున్నారని సమాచారం.

ఒక్కరోజుతోనే ఆగిన దాడులు

గ్రానైట్ అక్రమ రవాణాపై మూకుమ్మడిగా దాడులు చేసిన జీఎస్టీ అధికారులు ఒక్కరోజు ముచ్చటగానే ముగించారు. శనివారం పల్నాడు, బాపట్ల జిల్లాలతోపాటు గుంటూరు జిల్లా అధికారులను సైతం రప్పించి ఆరు బృందాలుగా ఏర్పడి దాడులుచేశారు. ఆది, సోమవారాలు సైతం అక్రమ గ్రానైట్ లారీలు జిల్లా మీదుగా వెళ్తున్నప్పటికీ అధికారులు చూసీచూడనట్టు వదిలేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమ రవాణాపై దాడులు ఒక్కరోజులోనే ఆగడం వెనుక ఏం జరిగిందనే చర్చ జరుగుతోంది. దాడులపై ఓ జీఎస్టీ అధికారితో మాట్లాడగా ఉన్నతాధికారుల నుంచి ప్రత్యేక ఆదేశాలు రావడంతో శనివారం చేశామని తెలిపారు.



కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

ప్రతి ఫిర్యాదు పరిష్కారమే లక్ష్యం

కలెక్టర్ పి.అరుణ్‌బాబు

నరసరావుపేట: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చే ప్రతి ఫిర్యాదు పరిష్కారం కావాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు అధ్యక్షత వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి 64 వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమస్యలు పరిష్కారం అవుతాయనే నమ్మకంతో జిల్లా నలుమూలల నుంచి అర్జీదారులు ఇక్కడకి వస్తుంటారన్నారు. వారి సమస్యలను సావధానంగా విని, సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమస్యకు నాణ్యమైన పరిష్కారం చూపాలని, అర్జీదారు కూడా సంతృప్తి చెందాలని సూచించారు. ఇందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, జిల్లా రెవెన్యూ అధికారి ఏ.మురళి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నోటీసులు ఇచ్చి వదిలేశారు



గ్రామ సర్వే నంబరు 216లో ఉన్న 16సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని ముగ్గురు వ్యక్తులు ఆక్రమించి అనధికారికంగా ఇళ్లు నిర్మించారు. దీనిపై గతేడాది అక్టోబరు 21న మీ కోసంలో ఫిర్యాదు చేశా. కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్‌కు ఆధారాలు కూడా సమర్పించా. ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేశారు. ఇప్పటివరకు మిగతా చర్యలు తీసుకోలేదు. ఈ వ్యవహారంపై 16ఏళ్లుగా పోరాడుతున్నా.

–ఆవుల సాంబశివరావు, గణపవరం, నాదెండ్ల మండలం

కాలువల మరమ్మతు వెంటనే చేయాలి



నాగార్జున సాగర్ కుడికాల్వ పరిధిలో ఉన్న ఎన్ఎస్పీ కాలువలు మరమ్మతులు చేయక పోవడం వల్ల అడవిని తలపించేలా ఉన్నాయి. కాలువలు పూడిపోయి నీళ్లు పొలాల మీద, ఇళ్లపై ప్రవహిస్తున్నాయి. రైతులు కాలువ మీద నడవడానికి రహదారి సౌకర్యం కూడా లేదు. చివరి భూములకు నీళ్లు అందట్లేదు. నరసరావుపేట మండలంలోని రావిపాడు, జొన్నలగడ్డ, కేసనపల్లి కాలువలు, వినుకొండ దగ్గర బ్రాహ్మణపల్లి – విఠంరాజుపల్లి కాలువ, ఈపూరు కాలువ, నూజెండ్ల దగ్గర ఉన్న కాలువలు సక్రమంగా లేవు. ప్రభుత్వం వెంటనే స్పందించి మరమ్మతులు చేయించాలి.

– వై.వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, పీడీఎం నాయకులు

నూరేళ్ల దీవెన.. నిండుగా ఉండాలి !



పాటిబండ్లలో సమష్టి పూజా బలిని నిర్వహిస్తున్న తెలుగు రాష్ట్రాల పీఠాధిపతులు

- పాటిబండ్ల గ్రామానికి ప్రత్యేక దీవెనలు అందించిన తెలుగు రాష్ట్రాల పీఠాధిపతులు
- చిరస్థాయిగా నిలిచేలా పాటిబండ్ల శత వార్షికోత్సవ వేడుకలు
- దివ్య పూజాబలికి తరలివచ్చిన వేలాది మంది భక్తులు

పెదకూరపాడు: నూరేళ్ల దీవెన ... నిండుగా ఉండాలి ! పాటిబండ్ల నుంచి ఎంతో మంది దైవసేవలో తరించాలని తెలుగు రాష్ట్రాల పీఠాధిపతులు దైవదేవుడిని ప్రార్థించారు. మండలంలోని పాటిబండ్లలో మూడు రోజులుగా జరుగుతున్న ముగ్గురు రాజుల శత వార్షిక వేడుకలు సోమవారంతో ముగిశాయి. తెలుగు రాష్ట్రాల నుంచి పీఠాధిపతులు తరలివచ్చి, పూర్ణకుంభంతో భక్తులకు ఆశీస్సులు అందించారు. పుణ్యభూమి పాటిబండ్ల నుంచి భవిష్యత్‌లో అనేక మంది గురువులు, మఠకన్యలు రావాలని ఆకాంక్షించారు.

కథోలికలకు పుట్టినిల్లు

ముగ్గురు రాజుల శత వార్షికోత్సవంలో భాగంగా చివరి రోజు పండుగ సమష్టి దివ్య పూజబలిని గుంటూరు పీఠాధిపతులు మహాఘన రైట్ రెవరెండ్ చిన్నాబత్తిన భాగ్యయ్య, తెలుగు రాష్ట్రాల పీఠాధిపతులు, గురువులు ఆధ్వర్యంలో నిర్వహించారు. శ్రీకాకుళం పీఠాధిపతులు మహాఘన, రైట్ రెవరెండ్ డాక్టర్ రాయరాల విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో భక్తులకు సందేశం అందించారు. ప్రేమ, కరుణ, జాలి ముఖ్య ఆయుధాలుగా కథోలికలు దైవచింతనతో మెలగాలని కోరారు. అనంతరం పీఠాధిపతులు భక్తులను ఆశీర్వదించారు. కోలాటం, భజన, సంప్రదాయ నృత్యాలతో కళకారులు అలరించారు. భక్తులు కొవ్వొత్తులను సమర్పించారు. వేడుకలలో పెదకూరపాడు శాసన సభ్యులు భాష్యం ప్రవీణ్ దంపతులు, సత్తెనపల్లి శాసన సభ్యులు కన్నా లక్ష్మీనారాయణ, మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ పాల్గొన్నారు.

తరలివచ్చిన పీఠాధిపతులు

గుంటూరు పీఠాధిపతులు చిన్నాబత్తిన బాగ్యయ్య సుందరీకరించిన దేవాలయంలో దివ్యసత్ప్రసాద ఆరాధన నిర్వహించారు. పూర్వ గుంటూరు బిషప్, కడప అపొస్తలిక పాలనాధికారి గాలి బాలి, విజయవాడ బిషప్ తెలగతోటి రాజారావు, నల్గొండ బిషప్ గోరంట్ల జోర్నేస్, వరంగల్ బిషప్ ఉడుముల బాల, ఖమ్మం బిషప్ సాగలి ప్రకాష్, నల్గొండ విశ్రాంత బిషప్ థామస్ కమల్, శ్రీకాకుళం బిషప్ రాయరాల విజయకుమార్, నెల్లూరు బిషప్ పిల్లి అంథోని దాసు పాల్గొన్నారు.

కన్నులపండవగా తేరు ఊరేగింపు

బాణసంచా అనంతరం తేరును బ్యాండు వాయిద్యలతో గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. సంఘ పెద్దలు, గురువులు, మఠకన్యలు వేలాదిగా పాల్గొన్నారు. సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్త్ నిర్వహించారు.

సిమెంట్ ఫ్యాక్టరీలో దొంగల బీభత్సం

- రెండు నివాసాల్లో భారీ చోరీ
- రూ.35 లక్షల విలువ చేసే బంగారం, వెండి ఆభరణాల చోరీ



ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు, క్లూస్ టీమ్

దాచేపల్లి: మండలం గామాలపాడు గ్రామ సమీపంలోని ఓ సిమెంటు ఫ్యాక్టరీలో దొంగలు బీభత్సం సృష్టించారు. ఇంటి యజమానులు ఊరు వెళ్లిన సమయంలో తాళాలు పగులగొట్టి సుమారు రూ.35 లక్షల విలువ చేసే బంగారం, వెండి ఆభరణాలు దోచుకెళ్లారు. ఘటన సోమవారం తెల్లవారుజామున జరిగినట్లు పోలీసులు గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గామాలపాడు సమీపంలోని ఓ సిమెంటు ఫ్యాక్టరీలో హెచ్ఆర్ మేనేజర్‌గా వి.శంకర్‌నారాయణరెడ్డి పని చేస్తున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి గత శనివారం షిర్డీ వెళ్లారు. ఈ క్రమంలో శంకరనారాయణరెడ్డి నివాసం ఉంటున్న ఏ–14 క్వార్టర్‌లోకి దొంగలు ప్రవేశించి బీరువా, లాకర్‌లో ఉన్న 20 తులాల బంగారం, 16 తులాల వెండి, రూ.20వేలు నగదు దోచుకెళ్లారు. వీటి విలువ సుమారు రూ.16.5 లక్షలు ఉంటుందని అంచనా వేస్తున్నారు. అనంతరం ఏ–9 క్వార్టర్‌లో నివాసం ఉంటున్న కె.వీరప్రకాష్ నివాసంలో దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి బీరువా, లాకర్‌లో ఉన్న రూ. 17.5 లక్షల విలువ చేసే 20 తులాల బంగారు ఆభరణాలతోపాటు, రెండున్నర కిలోల వెండి దోచుకెళ్లారు. వీరప్రకాష్ స్వగ్రామమైన అనంతపురం వెళ్లారు. వీరు ఇంట్లో లేని సమయంలో ఈ చోరీలు జరగడం స్థానికంగా కలకలం రేపింది.

తరతరాల 'భూ'గోతం

- పేరుకే అగ్రహారం.. హక్కులు మాత్రం శూన్యం
- భూములపై నేటికీ హక్కు లేని రైతులు
- కనీసం పసుపుకుంకుమ కింద కూతుళ్లకు భాగం ఇవ్వలేని తల్లిదండ్రులు
- భూములపై పుట్టని బ్యాంకు అప్పులు
- అందని ప్రభుత్వ రాయితీలు



కోగంటివారిపాలెంలోని అగ్రహారం భూములో వేసిన పత్తి పంట

అచ్చంపేట: మండలంలోని ఒకనాటి కోగంటిపాలెం అగ్రహారమే నేటి కోగంటివారిపాలెం గ్రామం. కృష్ణానదికి ఆనుకొని ఉంది. గ్రామంలో 1,200మంది జనాభా ఉంటారు. గ్రామ పరిధిలో 1,380 ఎకరాలకు పైగా సేద్యపు భూములున్నాయి. వీటిని గ్రామంతోపాటు పొరుగు గ్రామాలకు చెందిన 450మంది రైతులు సాగుచేసుకుంటున్నారు. అయితే, పంటలు వేసుకుని వచ్చే ఫలసాయాన్ని అనుభవించడానికి తప్పా మరేతర అవసరాలకు ఉపయోగించుకోలేని దుస్థితిలో ఉన్నారు. భూములన్నీ అగ్రహారం, ఇనాం, సత్రం భూములు కావడంవల్లే ఈ పరిస్థితి దాపురించింది. తమకు హక్కు కల్పించాలని కోరుతూ పలుమార్లు రైతులు ప్రభుత్వాలకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదు. కంటితుడుపు చర్యగా సర్వే చేయించి హద్దులు వేయించారని, ఆన్‌లైన్ చేసి పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వడం లేదని రైతులు వాపోతున్నారు.

భూములన్నీ అగ్రహారం బ్రాహ్మణులవే...

గ్రామంలోని భూములు మొత్తం బ్రాహ్మణులవే. జమీందారుల కాలంలో వీరికి దేవాలయాలలో ధూప దీప నైవేద్యాలు నిర్వహించేందుకు, వారి పాండిత్యానికి మెచ్చి కానుకల రూపంలో ఇచ్చారు. గ్రామాలకు వచ్చిపోయే బాటసారులకు వసతులు కల్పించేందుకు గాను కొన్ని ఇచ్చారు. అయితే, ఆ భూములపై వచ్చే ఆదాయం చాలకపోవడం, గ్రామం నుంచి వలసలు వెళ్లిన కొందరు బ్రాహ్మణులు రైతులకు అమ్ముకున్నారు. గ్రామంలోని రైతులతోపాటు పక్క గ్రామాలైన రుద్రవరం, చిగురుపాడు, అంబడిపూడి గ్రామాలకు చెందిన కొందరు రైతులు వీరివద్ద భూములను కొనుగోలు చేశారు. సదావర్తి సత్రం నిర్వహణకు కేటాయించిన 80 ఎకరాల భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, రెండు, మూడేళ్లకు ఒకసారి బహిరంగ వేలం నిర్వహిస్తున్నారు. ఏడాదికి సగటున ఎకరాకు రూ.15,000 చొప్పున 75 ఎకరాలకు రూ.11.25లక్షల ఆదాయాన్ని ప్రభుత్వానికి చెల్లిస్తూనే ఉన్నామని రైతులు చెబుతున్నారు.

అగ్రహారం, ఇనాం, సత్రం భూములు అంటే....

- మతపరమైన అవసరాల నిమిత్తం ఒక ప్రాంతంలోని కొంత భాగాన్ని గ్రామంగా రూపొందించి, అందులో నివసించే వారి భృతి కోసం కేటాయించిన భూములను అగ్రహారం భూములు అంటారు.
- ఇనాం భూములు అంటే జమీందారులను, రాజులను మెప్పించే విధంగా ప్రదర్శించే కళలు, సేవలకు మెచ్చి బహుమతిగా కానుకల రూపంలో ఇచ్చేవి.
- సత్రం భూములు అంటే గ్రామానికి వచ్చిపోయేవారి కోసం, గ్రామ సరిహద్దుల నుంచి వెళ్లే బాటసారుల కోసం సత్రాలు నిర్మించి, వాటి నిర్వహణకు కేటాయించిన భూములు.

విక్రయించుకునే హక్కు లేదు

అగ్రహారం, ఇనాం, సత్రం భూములను అనుభవించడమే గానీ అమ్ముకునే హక్కు లేదు. కాలగమనంలో చట్టంలో వచ్చిన అనేక మార్పులను ప్రభుత్వాలు పరిగణలోకి తీసుకోవాలని ఈ భూములపై తమకు హక్కు కల్పించే అవకాశాలున్నాయని గ్రామస్తులు కోరుతున్నారు. ముత్తాతలు, తాతలు, తండ్రుల నాటి కాలం నుంచి అనుభవిస్తున్న తమకు భూములపై హక్కులు కల్పించే అవకాశం ఉన్నప్పటికీ తమను మభ్యపెడుతున్నారే తప్పా గోడు ప్రభుత్వం పట్టించుకోవడంలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

తగ్గిన భూముల విస్తీర్ణం

18వ శతాబ్దంలో రాజా వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు జమీందారుగా పాలించిన రోజుల్లో కోగంటివారిపాలెంలో 1,380 ఎకరాల సేద్యపు భూములను కేటాయించారు. దేవాలయాలలో అర్చకత్వం వహించే బ్రాహ్మణులకు అగ్రహారం భూములుగా కొన్ని ఎకరాలు, ఇనాం కింద కొన్ని ఎకరాలు, సదావర్తి సత్రం నిర్వహణకు కొన్ని ఎకరాలను కేటాయించారు. కాలక్రమంలో కొన్ని ఎకరాల భూమి కృష్ణానది వరదలు వచ్చినప్పుడల్లా మునిగిపోయింది. రెవెన్యూ రికార్డుల ప్రకారం అగ్రహారం, ఇనాం, సత్రం భూముల కింద 1,380 ఎకరాలు ఉన్నప్పటికీ భౌతికంగా లేదనేది గమనార్హం.

పరిష్కారం చూపిస్తాం



గ్రామస్తులంతా సహకరిస్తే భూములు కలిగిన రైతులందరికీ పరిష్కారం చూపేందుకు అవకాశం ఉంటుంది. ఇప్పటికే భూములన్నింటిని రీ సర్వే చేశాం. సుమారు 450మంది రైతులున్నారు. వారిలో 100మందికి పైగా గతంలోనే ఫారం–8లు ఇచ్చాం. కొంతమంది రైతులు వాటివల్ల ఉపయోగంలేదు.. వద్దంటున్నారు. ముందుగా ఫారం–8లు అందరికీ ఇచ్చి ఏడీ సర్వేకు రిపోర్టు పంపాలి. ఏడీ సర్వే 13 నోటిఫికేషన్ ఇష్యూ చేస్తారు. ఇలా ప్రాసెస్ జరిగిన తరువాత ఆ భూములను వెబ్‌ల్యాండ్‌లో చేర్చి ఆన్‌లైన్ చేస్తాం. ఆన్‌లైన్ చేస్తేనే పాసు పుస్తకాలు వస్తాయి.

– జి.శ్రీనివాసయాదవ్, తహసీల్దారు, అచ్చంపేట

రాయితీలు కూడా అందడం లేదు



మా పూర్వీకులు ఈ భూములను అగ్రహారీల నుంచి కొనుగోలు చేశారు. అప్పటి నుంచి తరతరాలుగా సేద్యం చేసుకుంటూ జీవిస్తున్నాం. ఈ భూములపై మాకు ప్రభుత్వం నుంచి ఎలాంటి రాయితీలు రావడం లేదు. కనీసం రైతు భరోసా కూడా పొందలేక పోయాం.

– మర్యాద వెంకటరెడ్డి, రైతు, కోగంటివారిపాలెం

బ్యాంకులు రుణాలు కూడా ఇవ్వడం లేదు



మా భూములకు పట్టాదారు పాసుపుస్తకాలు లేవు. ఆన్‌లైన్ చేసి ఇవ్వాలని అధికారులను, పాలకులను అనేకసార్లు కోరాం. కాని వాళ్లు పట్టించుకోలేదు. పాసు పుస్తకాలు లేకపోవడంతో బ్యాంకులలో రుణాలు కూడా పొందలేకపోతున్నాం.

– సుంకర ప్రతాప్‌రెడ్డి, రైతు, కోగంటివారిపాలెం.

పాసు పుస్తకాలు లేక అవస్థలు



ప్రకృతి వైపరీత్యాల వల్ల పండించిన పంటకు నష్టం వాటిల్లితే ప్రభుత్వం నుంచి పరిహారం పొందలేకపోతున్నాం. ఈకేవైసీ చేసిన భూములకే వస్తుందని, దీనికి పట్టాదారు పాసుపుస్తకాలు కావాలని సంబంధిత అధికారులు చెబుతున్నారు. పాసు పుస్తకాలు లేక అవస్థలు పడుతున్నాం.

– బోదెల హనిమిరెడ్డి, రైతు, కోగంటివారిపాలెం

క్లుప్తంగా

ట్రాక్టర్ పైనుంచి పడి వ్యక్తి మృతి



వినుకొండ(నూజెండ్ల): ట్రాక్టర్ పైనుంచి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన వినుకొండ మండలం చాట్రగడ్డపాడు సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. మృతుడు సంతమాగులూరు మండలం ఏల్చూరు గ్రామానికి చెందిన గమల్ల నరసింహారెడ్డి. ఏల్చూరు నుంచి ట్రాక్టర్‌లో రాళ్లు తీసుకొని చాట్రగడ్డపాడులో దించేసి వెళ్తున్న క్రమంలో ఈ ప్రమాదం జరిగింది. ట్రాక్టర్‌కు అడ్డొచ్చిన బైక్‌ను తప్పించే క్రమంలో ట్రాక్టర్ పైనుంచి పడి నరసింహారెడ్డి మృతి చెందాడు. మరో ముగ్గురికి గాయాలు కాగా చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వినుకొండ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రమాదేవికి సంక్రాంతి కళారత్నం అవార్డ్ ప్రదానం



సత్తెనపల్లి: తెలుగు కళారత్నాలు సాంస్కృతిక సేవా సంస్థ–2025 సంక్రాంతి పండుగ సందర్భంగా విజయవాడలోని ఠాగూర్ గ్రంథాలయంలో జానపద సంక్రాంతి జాతీయ కవి సమ్మేళనం ఈ నెల 5న నిర్వహించింది. ఇందులో కవితాగానం చేసిన సత్తెనపల్లికి చెందిన రచయిత్రి సరికొండ రమాదేవికి జాతీయ సంక్రాంతి కళారత్నం అవార్డ్ అందుకున్నారు. నిర్వాహకులు మెమెంటో, సర్టిఫికెట్ ఇచ్చి శాలువాతో ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రమాదేవిని సత్తెనపల్లిలోని వివిధ కళా సంస్థల నిర్వాహకులు అభి నందించారు.

గామాలపాడులో క్షుద్ర పూజల కలకలం



దాచేపల్లి: మండలంలోని గామాలపాడు గ్రామ సమీపంలోని పొలం బాటలో క్షుద్ర పూజలు కలకలం రేపాయి. శనివారం పొలాలకు వెళ్తున్న రైతులు క్షుద్రపూజల కోసం తెచ్చిన పూజా సామగ్రి ముగ్గుతో మనిషి ఆకారంలో వేసిన బొమ్మని గుర్తించారు. పొలంబాటలో క్షుద్ర పూజలు చేయడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమను భయభ్రాంతులకు గురి చేసేందుకు, పొలాల వైపు వెళ్లకుండా చేసేందుకే కొంత మంది ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడ్డారని రైతులు చెబుతున్నారు.

ప్రజల ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం

అదనపు ఎస్పీ జేవీ సంతోష్

నరసరావుపేట: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన పరిష్కరించే విధంగా తక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా పరిపాలనా విభాగ అదనపు ఎస్పీ జేవీ సంతోష్ ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌కు అధ్యక్షత వహించి ప్రజల నుంచి కుటుంబ, ఆర్థిక, ఆస్తి తగాదాల సమస్యలకు సంబంధించిన 84 ఫిర్యాదులు స్వీకరించారు. ప్రతి ఫిర్యాదుదారుని సమస్యపై శ్రద్ధ వహించి, నిర్దీత గడువులోగా పరిష్కరించడానికి కృషిచేయాలని ఆదేశించారు.



జిల్లా పోలీసు కార్యాలయంలో సమస్యను వింటున్న అదనపు ఎస్పీ సంతోష్

స్థలం ఇప్పిస్తామని మోసం

ఏడాది క్రితం పి.మురళీకృష్ణ, కె.చంద్రశేఖర్‌లు నాకు స్థలం ఇప్పిస్తామంటూ రూ.3లక్షలు తీసుకున్నారు. ఇప్పటివరకు ఇప్పించలేదు, తిరిగి డబ్బులు ఇవ్వలేదు. అడిగితే ఇబ్బందిపెడుతున్నారు. వారిపై చర్యలు తీసుకొని డబ్బులు తిరిగి ఇప్పించండి.

–మురళీకృష్ణ, తలార్లపల్లి, నూజెండ్ల మండలం

కుమారుడు, కుమార్తె భూమి సాగుచేయనీయట్లేదు

నాకు ఇద్దరు మగపిల్లలు, ఒక ఆడ సంతానం. పదేళ్ల క్రితం నా భార్య చనిపోయిన దగ్గర నుంచి చిన్న కుమారుడైన శ్రీనివాసరావు వద్ద ఉంటున్నా. నా పేరు పైనున్న మూడెకరాలు అతనే సాగు చేస్తున్నాడు. ఇప్పుడు పెద్ద కుమారుడు, కుమార్తె కలిసి ఆ భూమి సాగుచేయనీయకుండా అడ్డుపడుతున్నారు. వారిపై చర్యలు తీసుకొని నాకు న్యాయం చేయండి.

––తుర్లపాటి పున్నయ్య, తుర్లపాడు, రొంపిచర్ల మండలం

కుమారుడి ఆచూకీ కనుక్కోండి

నా పెద్ద కొడుకు అంజిరెడ్డికి రొంపిచర్ల గ్రామస్తులు కె.వెంకటరమణారెడ్డి కుమార్తె శిరీషతో వివాహమైంది. రెండు నెలలు పాటు నా వద్దనే ఉన్నారు. బెంగళూరు వెళ్లి వస్తానని భార్యను తీసుకొని వెళ్లాడు. అప్పటి నుంచి నాతో మాట్లాడటం గానీ, రావడం గానీ జరగలేదు. నా వియ్యంకుడు దంపతులను అడిగితే అమెరికా వెళ్లాడని చెప్పారు. ఫోన్లో మాట్లాడించండి అంటే మాట దాట వేస్తున్నారు. సుమారు 15 ఏళ్ల నుంచి నా కుమారుడు ఆచూకీ తెలియలేదు. విచారించి వాస్తవాలు తెలియజేయండి.

––కె.విజయమ్మ, కొత్తపల్లి, మాచర్ల మండలం

అక్రమంగా డబ్బు విత్ డ్రా

నేను నరసరావుపేట పట్టణం రామిరెడ్డిపేట నివాసి అయిన పి.వెంకటనారాయణ వద్ద రూ.10లక్షల చిట్‌లో సభ్యునిగా చేరాను. నెలకు రూ.25వేలు చొప్పున 25 నెలలపాటు కట్టే అంగీకారంపై సభ్యునిగా చేరేందుకు నా వద్ద నుంచి అప్పట్లో రెండు ఖాళీ చెక్కులు సెక్యూరిటీ నిమిత్తం తీసుకున్నారు. నా అనుమతి లేకుండానే వాటిని బ్యాంకులో ప్రజెంట్ చేసి నా ఖాతాలోని రూ.4.65లక్షలు విత్ డ్రా చేశారు. నన్ను మోసం చేసి ఇబ్బంది పెడుతున్నందుకు సదరు వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.

––గొట్టం గోవిందరాజులు, జాలలపాలెం, వినుకొండ మండలం

వడ్డీ డబ్బులు ఇవ్వకుండా దూషణ

నాకు 70ఏళ్లు, నా భర్త కరోనా సమయంలో చనిపోయారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతూ మందులకు అవసరమైన డబ్బులు సమకూరుతాయనే ఉద్దేశంతో నా వద్దనున్న రూ.10లక్షలు గుంటూరుకు చెందిన ఏ.రామారావుకు వడ్డీకి ఇచ్చాను. ఏడాదిపాటు సక్రమంగానే చెల్లించాడు. ఇప్పుడు వడ్డీ, అసలు ఇవ్వట్లేదు. అదేమంటే దూషిస్తూ బెదిరిస్తున్నాడు. అతడిపై చర్యలు తీసుకొని నాకు న్యాయం చేయండి.

––చిలంకూరి ఆదిలక్ష్మి, నరసరావుపేట పట్టణం

శోక సంద్రంగా ఏరియా ప్రభుత్వ వైద్యశాల

- ఇద్దరు విద్యార్థుల మృతదేహాలకు పోస్ట్‌మార్టం పూర్తి
- కుటుంబ సభ్యులకు అప్పగించిన పోలీసులు

సత్తెనపల్లి: విద్యార్థుల తల్లిదండ్రులు, బంధువుల రోదనలతో శోక సంద్రంగా ఏరియా ప్రభుత్వ వైద్యశాల మారింది. మాయదారి గుంటూరు బ్రాంచ్ కెనాల్ కాలువ ఈత రూపంలో ఇద్దరు విద్యార్థులను కబళించిన సంగతి తెలిసిందే. ఎన్నో ఆశలతో అపురూపంగా పెంచుకుంటున్న ఇద్దరు బిడ్డలను నీటి రూపంలో ప్రాణాలు తీసిన ఘటన అందరి హృదయాలను కలచివేసింది. ఈ దారుణంతో రెండు కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయాయి. నల్లూరి గోపీచంద్ (15), పొదిలి చరణ్(15) విద్యార్థులు సరదాగా ఈత కొట్టేందుకు వెళ్లడంతో కాలువలో అక్కడికక్కడే మృతి చెందారు. ఒకరు అరగంటకు దొరకగా .. మరొకరు 4:30 గంటలపాటు గాలిస్తే గానీ దొరకలేదు. విద్యార్థుల మృతదేహాలను ఆదివారం రాత్రి సత్తెనపల్లి ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు పోస్టుమార్టం నిమిత్తం తీసుకొచ్చారు. సోమవారం పోస్టుమార్టం అనంతరం ఆయా కుటుంబ సభ్యులకు అందించారు.



పట్టణంలోని ఏరియా వైద్యశాలకు చేరుకున్న జనం

లే నాన్నా .. బడికెళ్లాలి !



గోపీచంద్ మృతదేహంతో కుటుంబ సభ్యులు, బంధువులు

కాలువలో ఈతకు వెళ్లి మృతి చెందిన కుమారుడు గోపీచంద్ మృతదేహాన్ని హత్తుకొని ఆ తల్లిదండ్రులు సుహాసిని, కిరణ్‌కుమార్ ఏడ్చిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది. నా కొడుకు ఎక్కడికి పోలేదు ... వాడిని ఎవరికీ ఇవ్వను! అంటూ మృతదేహాన్ని పట్టుకొని ఆమె చేసిన ఆర్తనాదాలు కన్నీళ్లు తెప్పించాయి. మృతదేహాన్ని చెంపపై కొడుతూ లేపేందుకు యత్నించి 'లే నాన్నా .. బడికెళ్లాలి' అంటున్న ఆమెను చూసిన అక్కడ జనం హృదయాలు భారంగా మారాయి. రోదనలతో మృతదేహాన్ని తీసుకొని అంత్యక్రియలకు వడ్డవల్లి శాస్త్రీనగర్‌కు వెళ్లారు.

చిన్నోడా మన ఊరు ... పోదాం పద !



చరణ్ మృతదేహాన్ని లారీకి ఎక్కిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

చరణ్ మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు కృష్ణకుమారి, భాస్కర్‌తో పాటు బంధువులు గుండెలు బాదుకుంటూ ఏడ్చారు. ఏ చిన్న పని జరిగినా సరదాగా సందడి చేసే చిన్న కొడుకుని ఎందుకు దూరం చేశావయ్యా ! అంటూ రోదించారు. చదువు కోసం వచ్చి మాకు కనిపించకుండా పోయావా ? అంటూ రోదిస్తున్న తీరు హృదయాలను కలచి వేసింది. తల్లిదండ్రులతో పాటు తాతయ్య, మేనమామ, అందరూ ఆ ఘోరాన్ని తట్టుకోలేక ఏడ్చిన తీరు చూసి ప్రతి ఒక్కరి కళ్ల వెంట నీళ్లు కారాయి. 'చిన్నోడా మన ఊరు .. పోదాం పద' అంటూ విలపిస్తూ మృతదేహన్ని తీసుకొని అంత్యక్రియలకు స్వగ్రామమైన యడ్లపాడు మండలం లింగారావుపాలేనికి పయనమయ్యారు.

కోల్డ్ స్టోరేజ్ గుమస్తాపై చర్యలు తీసుకోవాలి

కలెక్టర్, ఎస్పీ కార్యాలయాల్లో ఫిర్యాదు చేసిన నాయకులు, బాధిత రైతులు

నరసరావుపేట: రైతుల నుంచి రూ.7కోట్ల విలువైన కందులు, శనగలు కొనుగోలు చేసి వారికి డబ్బులు చెల్లించకుండా మోసం చేసిన చిలకలూరిపేటకు చెందిన కోల్డ్ స్టోరేజ్ గుమస్తా గోగుల నాగరాజుపై చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం పల్నాడు కార్యదర్శి ఏపూరి గోపాలరావు డిమాండ్ చేశారు. బాధిత రైతులతో కలిసి సోమవారం జిల్లా కలెక్టర్, ఎస్పీ కార్యాలయాల్లో ఫిర్యాదు చేశారు. అనంతరం గోపాలరావు మాట్లాడుతూ చిలకలూరిపేట మండలం ఏలూరు, కుక్కపల్లివారిపాలెం, బాపట్ల జిల్లా యద్దనపూడి, చింతపల్లిపాడు, గన్నవరం, గుంటూరు జిల్లా పరిటాలవారిపాలెం గ్రామాలకు చెందిన రైతులు గత ఏడాది కందులు, శనగలు పండించారని తెలిపారు. ధర లేకపోవడంతో చిలకలూరిపేట మండలంలోని విఘ్నేశ్వర కోల్డ్ స్టోరేజ్, యద్దనపూడిలోని శ్రీనివాస కోల్డ్ స్టోరేజ్, పసుమర్రులోని లలిత, మహాలక్ష్మి కోల్డ్ స్టోరేజీలలో నిల్వ చేసుకున్నారని చెప్పారు. అయితే, చిలకలూరిపేట కోల్డ్ స్టోరేజ్‌లో గుమస్తాగా పనిచేస్తున్న గోగుల నాగరాజు మంచి ధరతో 10 రోజుల్లో నగదు చెల్లిస్తానని నమ్మించి తక్కువ ధరకు మిల్లర్లకు విక్రయించి సొమ్ము చేసుకున్నాడని పేర్కొన్నారు. నెలలు గడుస్తున్నా డబ్బులు చెల్లించకపోవడంతో మోసపోయామని తెలుసుకున్న రైతులు, పోలీసులను ఆశ్రయించగా నాగరాజును బెయిలుపై విడుదల చేశారని తెలిపారు. రైతులు న్యాయం చేయాలని రైతు సంఘాన్ని ఆశ్రయించారని వారికి న్యాయం చేసే వరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. కౌలు రైతు సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి వై.రాధాకృష్ణ మాట్లాడుతూ బాధితులలో కౌలు రైతులు కూడా ఉన్నారన్నారు. నాటి, నేటి ప్రభుత్వాలు కందులు శనగ పంటలను మద్దతు ధరకు కొనుగోలు చేసి ఉంటే రైతులకు ఇటువంటి పరిస్థితి ఉండేది కాదని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం. అధికారులు జోక్యం చేసుకొని బాధిత రైతులకు న్యాయం చేయాలని ఆయన కోరారు. మద్దతు ధర ప్రకటించి రైతులు పండించిన అన్ని ఉత్పత్తులను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. తక్కువ ధరకు కొనుగోలు చేసిన మిల్లర్లపై కూడా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బాధిత రైతులు ఎస్.కోటేశ్వరరావు, బుల్లి స్వామి, అజయ్‌కుమార్, పెరవలి శ్రీనివాసరావు, గొట్టిపాటి వెంకట్రావు, చిగురుపాటి రాజబాబు, శేషగిరి బాబు పాల్గొన్నారు.



ఎస్పీ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న రైతు సంఘ కార్యదర్శి గోపాలరావు

మాదిగలకు అన్యాయం జరగకుండా చూడాలి



నరసరావుపేట: కులగణన నిష్పక్షపాతంగా జరిపి మాదిగలకు అన్యాయం జరుగకుండా చూడాలని మాదిగ రిజర్వేషన పోరాట సాధన సమితి(ఎమ్మార్పీఎస్ఎస్) జిల్లా అధ్యక్షులు చింతిరాల మీరయ్య మాదిగ కోరారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో మాదిగలకు న్యాయం చేయాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో సంఖ్యాపరంగా మాదిగలు రెండో స్థానంలో ఉన్నందున పేర్లు మార్చి మాలలుగా సచివాలయం సిబ్బంది ఎక్కిస్తున్నారని ఆయన ఆరోపించారు. రెండు రోజులు క్రితం నరసరావుపేటలో 150 మంది మాదిగలను మాలల కులంలోకి మార్చినట్లు తెలిపారు. దీనిపై కలెక్టర్ స్పందించి సోషల్ వెల్ఫేర్ డీడీతో వెరిఫికేషన్ చేయించి మాదిగలకు అన్యాయం జరగకుండా చూస్తానని హామీ ఇచ్చారని మీరయ్యమాదిగ చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గం అధ్యక్షులు సీహెచ్.సల్మాన్‌రాజ్, వినుకొండ నియోజకవర్గం అధ్యక్షులు గుండాల ప్రభుదేవా, నరసరావుపేట టౌన్ నాయకుడు మల్లెల మధు, మండల నాయకులు జి.ప్రశాంతి పాల్గొన్నారు.

28 నుంచి జాతీయ స్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు

రెంటచింతల: వచ్చే నెల 2న నిర్వహిస్తున్న స్థానిక కానుకమాత చర్చి 175 వసంతాల ఉత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 28 నుంచి జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎద్దుల బలప్రదర్శన పోటీలను సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో నిర్వహిస్తున్నట్లు కమిటీ నిర్వహకులు సోమవారం తెలిపారు. 28న రెండు పళ్ల విభాగం, 29న నాలుగు పళ్ల విభాగం, 30న ఆరు పళ్ల విభాగం , 31న న్యూ క్యాటగిరి విభాగం,ఫిబ్రవరి 1న జూనియర్స్ విభాగం, 3న సీనియర్స్ విభాగంలో పోటీలు జరుగుతాయని వివరించారు. ప్రతి విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఉంటాయని తెలిపారు. వ్యాఖ్యాతలుగా సూరపనేని రాధాకృష్ణ, పెద్దిరెడ్డి సుబ్బారెడ్డి, గూడ శ్రీను వ్యవహరిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిటీ నిర్వాహకులు వైఎల్ మర్రెడ్డి, ఆదూరి ఇన్నారెడ్డి, గాలి ప్రకాష్‌రెడ్డి, ఓరుగంటి ఇన్నారెడ్డి, మూలి రాజారెడ్డి, కొమ్మారెడ్డి జోసఫ్‌రెడ్డి పాల్గొన్నారు.

పట్టాలు తప్పిన గూడ్స్‌రైలు

పొందుగల రైల్వేస్టేషన్ సమీపంలో ఘటన

దాచేపల్లి : పల్నాడు జిల్లా పొందుగల రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం అర్ధరాత్రి గూడ్స్‌రైలు పట్టాలు తప్పింది. విష్ణుపురం రైల్వే స్టేషన్ వైపు నుంచి నడికుడి రైల్వేస్టేషన్‌కు వస్తున్న ఖాళీ గూడ్స్ రైలు పొందుగల రైల్వేస్టేషన్ సమీపంలో ప్రమాదవశాత్తు పట్టాలు తప్పింది. ఇంజన్ తరువాత ఉన్న ఒక బోగి పట్టాలు తప్పటంతో గూడ్స్‌రైలు ఆగింది. డ్రైవర్ నడికుడి రైల్వేస్టేషన్ అధికారులకు జరిగిన ఘటనపై సమాచారం అందించారు. నడికుడిలో అందుబాటులో ఉన్న ఇంజనీరింగ్ విభాగం అధికారులు సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పట్టాలు తప్పిన గూడ్స్‌రైలుకి మరమ్మతులు చేసి యథావిధిగా పట్టాలపై పెట్టే చర్యలు చేపట్టారు. ఈ మార్గంలో రాకపోకలు సాగించే రైళ్లను ఎక్కడికక్కడే అధికారులు నిలిపివేశారు.



చెంచుల ఆర్థిక అభివృద్ధికి కృషి

నివాస ప్రాంతాలను సందర్శించిన కేంద్ర బృందం

బొల్లాపల్లి : మండలంలో గిరిజనులు నివసించే గ్రామాల్లో సోమవారం కేంద్ర బృందం పర్యటించింది. చెంచు సమాఖ్య సంఘాలతో మాట్లాడి వారి జీవన స్థితిగతులను అడిగి తెలుసుకుంది. కేంద్ర బృందం ఉన్నతి పథకానికి చెందిన అడిషనల్ డైరెక్టర్ రాజాప్రతాప్, డైరెక్టర్ ఉషారాణి, సెర్ప్ ఐబీ డైరెక్టర్ వాల్మీకి, డీపీఎం హనుమానాయక్, ఉన్నతి డీపీఎం జీవన్‌లు ఆయా గ్రామాల్లో చెంచు కాలనీలను సందర్శించారు. వెల్లటూరులో చెంచులు నివసించే కాలనీని సందర్శించారు. జీవనోపాధులు, స్థితిగతుల గురించి ఆరా తీశారు. డీఆర్‌డీఏలో భాగంగా వెలుగు పథకంలో చెంచు సమాఖ్య సంఘాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఏ ఏపీఎం టి. రంగారెడ్డి మాట్లాడుతూ చెంచులకు జీవనోపాధి కల్పించి వారి ఆర్థిక అభ్యున్నతి ఎదుగుల కృషిలో భాగంగా కేంద్ర బృందం గ్రామాలను సందర్శించినట్లు తెలిపారు. ఉన్నతి పథకం ద్వారా బ్యాంక్ లింకేజీ రుణాలు అందించి పలు పథకాల్లో వారు అభివృద్ధి సాధించేందుకు మరింత సహకారం అందించనున్నట్లు తెలిపారు. వడ్డీ లేకుండా రుణాలు అందజేయనున్నట్లు ఏపీఎం తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన గిరిజన తెగలకు మరింత ఆర్థిక సహాయ,సహకారాలు అందించి వారి అభ్యున్నతికి పాటుపడే విధంగా కేంద్ర బృందం చొరవతో పథకాలు అమలు తీరు ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో సీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.



వెల్లటూరులో చెంచు సమాఖ్య సంఘాలతో మాట్లాడుతున్న కేంద్ర బృందం

కేంద్ర ప్రభుత్వ పథకాల నిధుల వృథా వద్దు

దిశ మీటింగ్‌లో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

నరసరావుపేట: జిల్లాలో కేంద్ర ప్రభుత్వ పథకాలను పక్కాగా అమలు చేయాలని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అధికారులను కోరారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయం, పర్యవేక్షక దిశా కమిటీ సమావేశానికి అధ్యక్షత వహించారు. 37 కేంద్ర ప్రభుత్వ పథకాలను సమీక్షించారు. రాష్ట్ర విభజన తర్వాత నిధుల కొరత ఎదుర్కొంటున్న రాష్ట్రంలో అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ నిధులు కీలకమని అన్నారు. వాటి ఫలాలు వీలైనంత ఎక్కువ మంది ప్రజలకు అందేలా చూడాలని తెలిపారు. ఏడాది పొడవునా తాగునీరు అందని చెంచు నివాసాలను గుర్తించి బోర్లు వేయించాలని సూచించారు. పాఠశాలల్లో ఇంటర్నెట్, ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. వచ్చే ఐదేళ్లలో పీఎంఈజీపీ ద్వారా జిల్లాలోని 50వేల మంది యువతకు రుణాలు ఇప్పించాలని తెలిపారు. జిల్లాలో రైల్వేగేట్ల వద్ద అవకాశం ఉన్నచోట్ల ఆర్వోబీలు, ఆర్‌యూబీలకు డీపీఆర్‌లు తయారుచేయాలని చెప్పారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ నాటికి ప్రధానమంత్రి జన్‌మన్ ద్వారా చెంచులకు మంజూరైన 600 వరకూ ఇళ్లను పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ మాట్లాడుతూ నరసరావుపేట మార్కెట్ యార్డులో నిలిచిపోయిన కోల్డ్‌స్టోరేజీ పనులను పునఃప్రారంభించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. మాచర్ల బైపాస్ భూముల పరిహారంలో లోపాలు సరిచేయాలని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి కోరారు. సమావేశంలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ హెన్రీ క్రిస్టినా, పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎంపీ లావు, కలెక్టర్ అరుణ్‌బాబు, జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యేలు

ముత్తూట్ ఫైనాన్స్ రెడ్ బ్రాంచ్ ఎదుట బాధితుల ఆందోళన

సత్తెనపల్లి: పట్నంలోని ముత్తూట్ ఫైనాన్స్ రెడ్ బ్రాంచ్ ఎదుట బైటాయించి సోమవారం పలువురు బాధితులు నిరసన తెలిపారు. బ్రాంచ్‌లో కుదవ పెట్టి నగదు తీసుకొని, తిరిగి చెల్లిస్తున్నా తమకు బంగారు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నెల రోజులు గడుస్తున్నా ఇంతవరకు న్యాయం జరగలేదని వాపోయారు. సుమారు రూ. 50 లక్షల బంగారం గోల్‌మాల్ జరిగిందని బాధితులు ఆరోపించారు. అయితే, బాధితులను పోలీసులు ఆందోళన చేయకుండా తీసుకుపోయారే తప్పా ఫైనాన్స్ కంపెనీపై కేసు నమోదు చేయక పోవడంపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

యువత నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి

సత్తెనపల్లి: యువత నైపుణ్యాలను మరింత మెరుగుపరుచుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కొండవీటి పద్మ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, సీడాప్ ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా సత్తెనపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఏపీ స్కిల్ డెవలప్ మెంట్ వారు జాబ్ మేళాను ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. పల్నాడు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి ఈ.తమ్మాజీరావు మాట్లాడుతూ జాబ్ మేళాకు నాలుగు కంపెనీలతో పాటు 59 మంది నిరుద్యోగ యువతీ, యువకులు హాజరయ్యారని తెలిపారు. ఇందులో 35 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపిక అయ్యారన్నారు. ఎంపికైన వారికి నియామక పత్రాలను అందించారు. కార్యక్రమంలో స్కిల్ హబ్ సత్తెనపల్లి కోఆర్డినేటర్ ఇందూరి రామకృష్ణారెడ్డి, రమ్య, అంజిరెడ్డి, శ్రీకాంత్, కంపెనీ హెచ్‌ఆర్ ప్రతినిధులు, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ప్రతినిధి శ్రీనివాసరావు, ఉద్యోగ కల్పన అధికారి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కొండవీటి పద్మ

టీడీపీ నేతల మట్టి దందా

- రైతు పొలం నుంచి అక్రమంగా తరలింపు
- తనకు న్యాయం చేయాలని కలెక్టర్‌కు ఫిర్యాదు
- ఆత్మహత్య శరణ్యం అంటున్న రైతు

దుర్గి: ఓ రైతు సాగు చేసుకుంటున్న పొలంలో టీడీపీ నేతలు మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. మండల పరిధిలోని కోలగుట్ల గ్రామానికి చెందిన రైతు కన్నెబోయిన బాల పేరయ్య 2.30 ఎకరాల భూమిని 13 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్నాడు. వైఎస్సార్ సీపీ పార్టీకి సానుభూతిపరుడుగా ఉన్న బాల పేరయ్య కూటమి ప్రభుత్వం అధికారంలో రాగానే గ్రామాన్ని విడిచి దుర్గిలో వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన టీడీపీ నేతలు గర్నె రమేష్, పీరబోయిన మన్నయ్య, ఈసబోయిన నాసరయ్య తన పొలంలో అక్రమంగా మట్టిని తరలించి అన్యాక్రాంతం చేస్తున్నారని పేరయ్య వాపోయాడు. విషయాన్ని స్థానిక రెవెన్యూ యంత్రాంగానికి తెలియజేసినా స్పందించడం లేదని తెలిపారు. తన కుటుంబానికి జీవనాధారమైన భూమిని కాపాడాలంటూ సోమవారం నర్సరావుపేటలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. తనకు న్యాయం జరగకపోతే అదే పొలంలో ఆత్మహత్య శరణ్యమని కన్నీటి పర్యంతమయ్యాడు. ఈ విషయమై స్థానిక తహసీల్దార్‌ను సాక్షి వివరణ అడగగా ఈ విషయం తన దృష్టికి రాలేదని తెలిపారు.



అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

నరసరావుపేట: అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి హెల్పర్లకు పదోన్నతులు కల్పించాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయు) జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటూరు మల్లీశ్వరి డిమాండ్ చేశారు. ఆలిండియా యూనియన్ ఆవిర్భావం సందర్భంగా సోమవారం పట్టణంలోని పలు ప్రదేశాల్లో జెండాను ఎగురవేశారు. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీలకు సుప్రీం కోర్టు తీర్పు మేరకు గ్రాట్యుటీతో పాటు కనీస వేతనం రూ.26వేలు అమలుచేయాలని కోరారు. పదవీ విరమణ చేసిన వారికి రూ.10వేలు పెన్షన్‌తో పాటు మినీ సెంటర్లను మెయిన్‌గా మార్చాలని డిమాండ్ చేశారు. మట్టి ఖర్చుల జీవో ఇచ్చి సంక్షేమ పథకాలు అమలుచేయాలని, అన్నీ యాప్‌లను కలిపి ఒక యాప్‌గా మార్చాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల ఐక్యత వర్ధిల్లాలని, ప్రమోషన్లు వెంటనే ఇవ్వాలంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా గౌరవాధ్యక్షుడు శిలార్ మసూద్, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.